# ఉరితీయబడ్డ నిజం

"నిజం" వట్టినే అనడంలేదు. ఒక్క అర్ధగంట అలాకూర్చో, నీ స్కెచ్ వేసుకుంటాను. ఇవ్వాళ నువ్వు చాలా అందంగా కనిపిస్తున్నావు" అన్నాడు శేఖరం.

మంజరి పెదాల్ని చిరునవ్వుల్తో తడిపి, సంతోషాన్ని కనబడనీయ కుండా కృత్రిమమైన కోపంతో వాటిని అద్ది, మూతిని సున్నలా చుట్టుకుని కూర్చుంది.

నవ్వినప్పుడు మంజరి మరీ అందంగా వుంటుంది. సన్నని పెదాలు ఆమెవి. ఆ కొసల్ని బాగా పురిపెట్టి బిగించి కట్టినట్టు తిన్నగా వుండక మెలి తిరిగి వుంటాయి. వట్టప్పుడే చిరునవ్వుల్ని దాచుకోవడం తెలీని దానిలా అని పిస్తుంది. ఎవరో ఆమె పెదాల కొసల్ని సాగదీసి, చివర్లలో బిగించిపట్టి నవ్వడం అలవాటు చేసినట్టున్నారు. నవ్వినప్పుడు చివర్లలో సొట్టలు కనిపి స్తాయి. కింది పెదవిమధ్య సన్నని గాడివుంది. నిరంతరం చిరునవ్వుల్ని వదులుతూవుండడంవల్ల గాడిపడి, పూడుకోక అలానే వుండిపోయింది. పెదాలు అల్పమైనవి కావడం వలన చిరుగాలికికూడా యిట్టే కదిలిపోతుంటాయి. దానికితోడు పెదాలమీద గిలిగింతలు ఎక్కువ. చల్లటిగాలి మృదువుగా స్పర్శి స్తేనే గిలిగింతలు పుట్టి పులకరించి పోతుంటాయి.

శేఖరం ఆమెనే చూస్తున్నాడు. సన్నని ఒంటిరేఖ గీతలాంటి పాపిడి మొదల్లో కుంకుమ అద్దుకుంది. చీకటిమేఘాన్ని చీలుస్తూ వాలిన ఒకేఒక సూర్యకిరణంలా వుందది. ఒత్తుగా పెరిగిన కనుబొమలు కొండల్లా నిలబడి వాటిమధ్య ఎర్రటికుంకుమబొట్టు ఉదయిస్తోన్న సూర్యుడిలా వుంది. బొట్టులో

చెమికిరేణువులు, కొండలపై శిఖరాల్ని తాకుతూ కిరణాల్ని నేలమీదకు వంపుతున్నాయి. చెమటకు తడిసి కరిగి కిందకుజారిన కుంకుమచార, కొండల మధ్య లోయలో ప్రవహిస్తోన్న ఏకొండవాగో ఉదయకిరణాలతో ఎర్రబడ్డట్టుంది. కళ్ళకు కాటుక పెట్టుకొని, కొసల్ని కాటుక గీతల్తో వంపులుతిప్పింది. అందువల్ల అవి మరీ పొడుగ్గా కనిపిస్తున్నాయి. కొండకింద యేర్పడ్డ నీటి మడుగుల్లాంటి ఆ కళ్ళల్లో అంచులు కాటుకతో నల్లబడి, చీకట్లు గోతులచుట్టూ చేరుకున్నట్టు అనిపిస్తున్నాయి.

ఆ మడుగుల్లో రెండు చేపలు. ఎప్పుడూ అవి నిలకడగా వుండవు. అటూయిటూ కదులుతూనే వుంటాయి. కొసలవరకూ వెళ్ళి చీకట్లను దాటలేక ఆగిపోతుంటాయి. అక్కడనుండి మళ్ళీ వెనక్కు. ఈ చివరకు రాగానే మళ్ళీ అడ్డుగా చీకట్లు. అక్కడనుండి మరోవైపు—అలా అలసటనేది లేకుండా కదులుతూనే వుంటాయి. చీకట్లమధ్య వాటిని బంధించేసినట్లుంది. ఆ బంధికానానుండి విముక్తికై అవి ఎప్పుడూ తిరుగుబాటు చేయడంలోనే ఒక అందంవుంది. కొసలవరకూవెళ్ళి, బలాన్నంతా కూడగట్టుకొని, అంచుల్ని ఢీకొని, పట్టు చిక్కించుకొని పెనుగులాడి, చివరకు అలసిపోయి వెనక్కు వెళ్ళిపోవడంలో నిరాశలేదు. తిరిగి ప్రయత్నం చేయాలనే కొత్తవుత్సాహం, వుత్తేజం వున్నాయి.

శేఖరం తననే నిదానించి చూడడం ఆమెకు అదోలావుంది. అక్కడనుండి లేచివెళ్ళి టేబిల్‌మీది పుస్తకంతీసి పుటలు తిరగేస్తూ "వట్టినే. నాకులేని అందాన్ని కల్పించి ఎగతాళి చేయాలని చూస్తున్నావు. అంతా అబద్ధం. నీ మాటలు నమ్మకూడదు" అంది.

ఆమె కంఠంకూడా అందమైనదే. చిన్నప్పుడు తల్లిదండ్రులు బాగా ఏడిపించి ఆ కంఠాన్ని సానబెట్టినట్టున్నారు. మాట్లాడేప్పుడు ఆ మాటల వెనుక రాగం వున్నట్టనిపిస్తుంది.

చిన్నప్పుడు గట్టిగా ఏడవగలిగినవాళ్ళు పెద్దయ్యాక ప్రయత్నిస్తే చక్కగా పాడగలరు కూడాను. మంజరి ఎప్పుడూ సంగీత సాధన చేయలేదు గానీ, చేస్తే అట్టేకష్టపడకుండా మంచిగాయకి అయివుండేది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు శేఖరం?" అందితిరిగి ఆమె, అతను ఆలోచించడం చూసి.

"ఏమీలేదు. నువ్వు సంగీతం ఎందుకు నేర్చుకోకూడదా అని"

"చాల్లే. నాకు సంగీతంరాదని నువ్వేమీ వెటకారం చేయనక్కర్లేదు" అంది చిరుకోపాన్ని అభినయిస్తూ

మంజరికి అసలు కోపాన్ని ప్రదర్శించడమే చేతకాదు. సూటిగా అతని కళ్ళల్లోకి చూడాలని కంటిపాపలను కళ్ళమధ్యకు తెచ్చి, శక్తినంతా కేంద్రీకరించి, కదలకుండా పాపల్ని నిలుపుదామని ప్రయత్నించి, చేతగాక ఆ ప్రయత్నం విరమించుకుంది. పాపలు స్థిరంగా నిలుచోలేక పక్కలకు జారిపోయాయి. కళ్ళల్లో పులుముకున్న ఎరుపురంగును పాపలు చీకట్లోకి నెట్టేశాయి.

"సరేలే ఇలావచ్చి కూర్చో. ఒక్క అరగంట" శేఖరం లేచివెళ్ళి తన ఎదురుగా మూడు గజాల దూరంలో చాపపరిచాడు.

ఆమె వచ్చి కూర్చుంది. మోకాళ్ళను మడిచి, ఎడంచేతిని చాపమీదఆన్చి, బరువునంతా దానిమీద నిలిపి. కుడిచేతిని మడిచిన మోకాళ్ళ మీదకు నిర్లక్ష్యంగా వదలి కిందకుచూస్తూ కూర్చుంది. ఆమెకు కుడివైపునవున్న కిటికీలోంచి వెలుతురు చెంపలమీదా, వక్షాలమీదా, భుజాలమీదాపడి నిలవలేనట్టు పక్కలకు జారిపోతోంది. ఒక వైపునుంచే వెలుతురు రావడంవలన చీర పవిటలో, కొండమీదకు చెక్కిన అంతులేని మెట్లల్లా మడతలు ఏర్పడ్డాయి, చిరుగాలిలో ఎగిరి అల్లరిచేసే ఆకతాయి వెంట్రుకల్నిపట్టుకొని కదలనీయకుండా గట్టిగా బంధించి అల్లినజడ జలపాతంలా వెనకనుంచి దూకి, లోయలోంచి ప్రవహించి, మోకాళ్ళమీదుగాజారి కింద పడుతోంది. వంగినప్పుడు పవిటలో నుండి తప్పుకుని నిటాగ్గా కిందకుదిగిన ముత్యాల సరం, నీలంరంగు చీరలో నక్షత్రాల్ని దండగాగుచ్చి వేలాడదీస్తున్నట్టుంది.

మెల్లగా అతను ఆమె స్కెచ్ గీశాడు. ముక్కుబాగా పొడుగయిపోయింది. చెరిపేసి మళ్ళీ వేద్దామనుకున్నాడు కాని మంజరికి పొడుగుముక్కే బావుంటుంది. సన్నని కంఠమూ, అల్పమైన నడుమూ, కోలముఖమూ, పొడుగు

వేళ్ళు వున్నవాళ్ళకు సూదిగా ఆఖరయిన పొడుగాటి ముక్కే బావుంటుంది. ప్రపంచ ప్రసిద్ధమైన నటరాజు కంచు శిల్పంలో ముక్కుపొడుగు. భారత దేశంలోని శిల్పాల్లోవున్న విశిష్టతే అది. సాధారణంగా ముక్కులు సూదిగా పొడుగ్గా కత్తి అంచులా ఆఖరయి వుంటాయి. ఈజిప్షియను శిల్పాల్లోనూ, అంతే. క్లియోపాత్రా ముక్కుపొడుగు. కాని గ్రీకు శిల్పాల్లోనూ, చిత్రాల్లోనూ ముక్కులు పొట్టి. ప్రాక్సిటలస్ 'వీనస్'లో గాని, రాఫెల్ 'మదొన్నా' లోగాని, డావెన్సీ, 'మోనాలిసా'లోగాని ముక్కులు పొడుగ్గాలేవు. ఆ ధోరణేవేరు. చేతి వేళ్ళుపొట్టి. పుష్టిగా ఏపుగా పెరిగి మెలితిరిగిన కండరాలతో శరీరం వుంటుంది. అలాంటి వారికి పొట్టిముక్కు బావుండొచ్చు. మంజరిలాంటి సన్న వాళ్ళకు పొడుగు ముక్కే అందం. ఆమెను చూస్తే దక్షిణాది కంచుశిల్పంలో టకహస్త ముద్రాంకితయైన 'ఉమ' జ్ఞాపకానికొస్తుంది.

చిత్రం వేస్తుండగా మధ్యలో ఓసారి రెప్పల్ని విప్పి చూపుల్ని ఎత్తిపట్టు కొని అతనివైపు చూసింది మంజరి. అతను చిత్రంవేస్తూ ఆమె వైపే చూస్తు న్నాడు. అతని చూపులు కంఠం దిగువున ఎత్తు పల్లాల్ని కొలుస్తున్నాయి. ఒకటి, రెండు, మూడు అని లెక్క పెడుతున్నాడు కూడాను. బహుశా కొండల మీదకు చెక్కిన మెట్లనేమో! అతని చూపులు మెల్లమెల్లగా ఒక్కొక్క మెట్టే ఎక్కి, అలసిపోయినట్టు కొద్ది క్షణాలు ఆగి, శిఖరాన్ని కొలుస్తూ మళ్ళీ ముందుకు పోతున్నాయి. చిట్టచివరి మెట్టుమీదనుండి శిఖరంమీదకు ఒక్క గెంతుగెంతి, ఆ చివర నిలుచుని, అవతల మబ్బుల్లో కూరుకుపోయిన మరో కొండశిఖరాన్ని వెతుకుతున్నాయి.

ఆమెకు చాలా సిగ్గేసింది. తన రహస్యాన్ని అతను తెలుసుకున్నట్టు అతనిముందు కూర్చోవడానికే ఆమెకు అదోలావుంది. అతను తన శరీరంలోని ప్రతి అణువుని కత్తిరించి, విడదీసి, భూతద్దం కిందవుంచి పరిశీలిస్తున్నట్టు అనిపించింది. ఆ చూపులు శరీరాన్నంతా తడిమి రహస్యాల్ని వెలికితీసి వెలు తుర్లో వుంచుతున్నట్టుంది.

అతని ఎదుట కూర్చోలేకపోయింది ఆమె.

"ఇదిగో! అలా అయితే ఎలా? చిత్రం పూర్తికావచ్చింది. ఇంకొద్ది సేపు." బ్రతిమలాడి, ఎలాగో ఒప్పించి కూర్చోబెట్టాడు

మరో పదిహేను నిమిషాల్లో చిత్రాన్ని పూర్తిచేశాడు. ఆ చిత్రం వేయడానికి ఆమె చాలా యిబ్బంది పెట్టింది పట్టుమని రెండు నిమిషాలు నిలకడగా కూర్చోలేదు ఆమె. చేతులు నొప్పెడుతున్నాయనో, నడుం లాగుతున్నదనో, ఇటుతిరిగో, అటు కదిలో చాలా యిబ్బంది పెట్టింది.

మరీ సుకుమారమైన అమ్మాయి. ముట్టుకుంటే కందిపోయేట్టు వుంటుంది. దానికితోడు కావాలని ఆమె మరికొంత అల్లరి చేసింది. అతను అనుకున్నంత సులభంగా తన అందం అతని చేతుల్లో యిమిడిపోవడానికి ఆమెకు ఇష్టం లేదు. అతన్ని ముప్పతిప్పలు పెట్టాలి. అతని శక్తిని పరీక్షించాలి. అతనిచేత పదేపదే బ్రతిమాలించుకొని, చుట్టూ తిప్పుకొని, ఏడిపించి అప్పుడు లొంగిపోవాలి. అప్పుడే అంచంవుంది. అందకుండావుండి అందడంలోనే ఆనందం వుంది. కనబడీ కనబడకుండా వున్నప్పుడే చూడాలనే ఆత్రుత.

విసిగించి విసిగించి చివరకు కుదురుగా కూర్చుంది ఆమె. చిత్రం అయిపోయేవరకూ మళ్ళీ కదల్లేదు.

పూర్తయిన చిత్రాన్ని ఆమెకిస్తూ "నువ్వెలా వున్నావో ఒకసారి చూసుకో" అన్నాడు.

ఆమె అందుకుని చూస్తోంది.

ఇతరుల ముఖాల్ని గుర్తుపట్టగలిగినంతగా మనిషి తన ముఖాన్ని తాను గుర్తుపట్టలేడు. మంజరికి ఆ ముఖం తనదేనా అనిపించింది. ముఖంలో ఏదో అందమైన మలుపు కనిపిస్తోంది. ఆ మలుపు ఎక్కడో స్పష్టంగా తెలీడంలేదు.

"బావుంది" అంది ఆ చిత్రాన్ని టేబిలుమీదవుంచి.

"నీలాగేవుందా లేక ఏ మార్పులన్నా అవసరమనిపిస్తున్నాయా?"

"చాలు. అలాగే వుండనియ్యి" అంది కాని ఆమెకు ఒకచోట సందేహంగా వుంది. ఆ విషయం అతనితో చెప్పలేకపోయిందామె. ఒక స్త్రీ ఒక పురుషుడి ముందు నిలబడి అడగదగ్గ విషయం కాదది.

"ఈ చిత్రం నాకు కావాలి, తీసుకోనా" అంది మంజరి.

"నీకు బహుమతి చేద్దామనే వేశాను. ఇప్పుడుకాదు, మరో రోజున యిస్తాను" అన్నాడు.

ఆమె పకపకా నవ్వి "బహుమతి యివ్వడానికి కూడా తిథులూ, నక్షత్రాలూ చూస్తున్నావేమిటి?" అంది. అంత గట్టిగా నవ్వినప్పుడు శరీరం ఆమె స్వాధీనంలో వుండదు. పట్టుతప్పి అటూ ఇటూ కదిలిపోతుంది. తూలి పోకుండా బేలన్సు కాసుకోవడానికని అకస్మాత్తుగా నవ్వును ఆపి ఊపిరి బిగ బెట్టుతుంది. అలాంటప్పుడు కంఠం దిగువున ఎత్తువల్లాలు మరీ ఎక్కువగా కనిపిస్తాయి. చిత్రం చూసినప్పుడు మంజరికి కలిగిన సందేహానికి సమాధానం అప్పుడు లభిస్తుంది. ఆ భాగాల్ని అతను వేస్తున్నప్పుడు ఆమె వూపిరి బిగబెట్టి వుండాలిమరి.

"తిథులూ, నక్షత్రాలూ చూడాలని కాదు. ఏదైనా సమయాన్ని పురస్కరించుకొని యిద్దామని—ఏ పుట్టిన రోజునో, ఏ పండగనాడో అయితే బావుంటుంది."

"ఏం, పెళ్ళినాడు యివ్వగూడదా?" అంది.

"ఎందుకివ్వగూడదూ" అన్నాడు కాని యిలా అడిగిందేమిటి!" అని అనిపించింది.

అతను ఆలోచించడం చూసి తిరిగి ఆవిడే అంది. "పుట్టినరోజుకన్నా పెళ్ళే ముందు వస్తుందిగాబోలు. పోనీ ఆరోజున యిద్దువుగానిలే."

మంజరి చాలా వింతగా మాట్లాడుతున్నట్టనిపిస్తోంది అతనికి. అమాయకంగా ఆమె అనడంలేదు. అమాయకమైన మాటల్లో పదాల్ని పట్టిపట్టి వదలడం వుండదు. కంటిపాపల్ని కొసలవరకూ పంపి ఓరగా చూడ్డం వుండదు. ఎదుటి ముఖంలోని మార్పుల్ని పరిశీలించే ప్రయత్నం వుండదు.

"ఏం అలా చూస్తున్నావ్ పెళ్ళి చేసుకోకుండా నన్ను ఎప్పుడూ యిలాగే వుండిపోమంటావా యేమిటి?" అంది తిరిగి ఆవిడే.

భుజాలు తడుముకొంటున్నట్టు మంజరి మాట్లాడ్డం అనుమానంగా వుంది. కాని ఏ విషయమూ ఆమెనడిగే ధైర్యం అతనికిలేదు.

మంజరి సమాధానం గురించి కొద్దిసేపు ఎదురుచూసి "సరే. ఎప్పుడో ఒకప్పుడు యిద్దువుగాని గాని, నేను వెళ్ళిరానా" అంది. కళ్ళను చక్రాల్లా చుట్టి, పెదాల్ని సాగదీసి ధనుస్సులా వంచింది.

ఆ కవ్వింపే అతనికి కోపాన్ని కలిగిస్తుంది. అవసరం లేకపోయినా ఎదుటి వాళ్ళను కట్టిపడేయాలనే ప్రయత్నం ఎందుకు? వాళ్ళను తెలివి తక్కువ వాళ్ళను చేసి చుట్టూ తిప్పుకుని, తప్పుకుని దూరంగా పారిపోవడం ఎందుకు? కళ్ళను ఎగరేయకుండానే, చిరునవ్వుల్ని వదలకుండానే మాట్లాడొచ్చుగా.

మంజరి వెళ్ళిపోయింది.

ఏమిటో! మంజరి తనకు అర్థంకానట్టే అనిపించింది అతనికి. మంజరే కాదు ఏ స్త్రీ అయినా సన్నిహితంగా వచ్చేకొలదీ అసలే అర్థంకాదు. స్త్రీ హృదయం పొగమంచులాంటిది. దూరంనించి చూస్తేనే దానికొక అందమైన రూపం వుంటుంది. దగ్గరకు వెళ్తే ఏమీ వుండదు. ఆ పొగమంచులో కప్పడి పోయినవన్నీ బైట పడతాయి.

మంజరి చెప్పిన విషయాన్ని గురించి వివరంగా ఏమన్నా తెలుస్తుందేమో అని అనీలా యింటికి వెళ్ళాడు. అనీలా మంజరి స్నేహితురాలు. అతనికి దూరపు బంధువు. ఆ వూరు వచ్చిన తొలిరోజుల్లో అతను అనీలా యింట్లోనే కొంతకాలంపాటు వున్నాడు. అక్కడే మంజరి పరిచయం అయ్యింది.

అనీలాను మంజరి గురించి అడిగితే ఆమె చెప్పింది—

"నిజమే. మంజరికి సంబంధాలు వస్తున్నాయి. ఆ మధ్యనే కొత్తగా ప్రాక్టీసు పెట్టిన ప్లీడరు తాలూకావారు వచ్చి చూసుకుని వెళ్ళారు. ఈ ఎండల్లో పెళ్ళి చేసెయ్యొచ్చు. సంబంధాలు చూస్తున్నారు. వరుడు మాత్రం యింకా స్థిరపడలేదు" అంది.

తిరిగి ఆవిడే "కాని ఆ యింట్లో ఆమెకు కొంత స్వేచ్ఛవుంది. ఆ స్వేచ్ఛను ఆమె ఎలా వుపయోగించుకొంటుందో మరి" అంది

అనీలా ఆ చివరి వాక్యాన్ని ఎందుకు చెప్పిందో అతనికి అర్థమయ్యింది. అనీలాకు అతని గురించీ, మంజరి గురించీ తెలియని రహస్యమంటూ ఏమీ

లేదు. వాళ్ళ పరిచయం యింతగా పెరగడానికి కారకుల్లో అనీలా కూడా ఒకర్తి.

శేఖరం అక్కడనుండి వచ్చేశాడు. ఎందుకో మంజరి మరొకరి సొత్తు గావడం అతనికి బాధగావుంది. ఆమెను పెళ్ళి చేసుకుతీరాలన్న బలమైన అభిప్రాయం ఎప్పుడూ కలగలేదుగాని, అలాంటి అవకాశంవస్తేమాత్రం వదిలిపెట్టగూడదనుకున్నాడు. ఆమె అతి సన్నిహితంగా వచ్చి, అలాంటి అవకాశం తనంతతానుగానే కల్పించినట్టనిపించింది. కాని అది వట్టిభ్రమే అయ్యింది. ఇప్పుడు ఎవరో ముక్కూమొగం ఎరుగని ఏ వ్యక్తోవచ్చి 'లా' పుస్తకాల్నీ, రూపాయినోట్లనీ ఎరచూపి, దగ్గరకు రప్పించుకొని బంధించేస్తాడు గాబోలు. కారులోతిప్పి అందమైన సాయంకాలాల్ని అనుభవించనీయకుండా నిరర్థకం చేస్తాడు గాబోలు. ఎత్తయిన భవంతి రెండో అంతస్తు మధ్యగదిలో ఆమెను వుంచి ఆకాశపు నీలిమను, అరుణోదయాల్ని చూడనివ్వడు గాబోలు.

కాని మంజరి వీటికి యిష్టపడుతుందా? అతి సామాన్యమైన స్త్రీలా పిల్లల్ని కని, వాళ్ళను పెద్దవాళ్ళనుచేసి, పెళ్ళిచేసి, పిల్లల్ని కనిపించి అజ్ఞాతం గానే కన్నుమూయడానికి వొప్పుకుంటుందా?—ఈ ప్రశ్నలకు సమాధానం మంజరే యివ్వాలి.

మంజరి ఆ తర్వాత కూడా అప్పుడప్పుడు వస్తుండేది. పూర్వంలాగానే మాట్లాడేది. నవ్వించేది. చలోక్తులు విసిరేది. మరీ సన్నిహితంగా వచ్చేస్తున్నట్లు మాట్లాడేది

కాని అతనికి యిదంతా కృత్రిమమే అనిపిస్తోంది. అంతకు పూర్వం యిచ్చిన చనువుకు అపార్థం కల్పించుకుని ఆలోచించనీయకుండా, అది కూడా యిలాంటి స్నేహం మాత్రమేనని చెప్పడం ఆమె వుద్దేశంగాబోలు.

మొదటి రోజుల్లో కావాలనే ఆమె అతనికి సన్నిహితంగా వచ్చింది. భవిష్యత్తునుగూర్చి నిర్ణయం చేసుకుంది. తన పరిధులు విశాలంకాని రోజుల్లో చేసుకున్న నిర్ణయమది. తర్వాత తర్వాత తనచుట్టూవున్న మనుషుల్ని, పరిసరాల్ని గూర్చి స్వార్థంతో ఆలోచించడం చేతనయ్యాక తొలి నిర్ణయానికి బలం యివ్వలేకపోయింది. ఆ విషయం తెలుసుకునేటప్పటికే పెనవేసుకున్న స్నేహపుముడులు విడివడనంతగా బిగుసుకుపోయాయి. ఆ ముడుల్ని మెల్ల

మెల్లగా విప్పుకోవాలి. సాగదీయడంవల్ల అవి తెగిపోవచ్చు. ఇద్దరికీ అది ఇబ్బందికరమే కావచ్చు. అందుకని ప్రయత్నపూర్వకంగా చేసిన స్నేహానికి రంగు పులిమి రూపాన్ని మార్చాలి. ఆ స్నేహాన్ని అలానే వుంచి అందులో ఏ ప్రత్యేకతాలేదని తెలియజెప్పాలి.

ఒకసారి మంజరి అనీలాచేత కబురంపించింది—శేఖరాన్ని అనీలా ఇంటి వద్ద కలుసుకొమ్మని. "నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలట. ఆదివారం మా యింట్లో కలుసుకోమంది" అని చెప్పింది అనీలా.

ఆదివారం ఉదయం అనీలా యింటికి వెళ్ళాడు. మంజరి అక్కడే వుంది. అతను రావడం చూడలేదు. సోఫాలో పక్కకు తిరిగి కూర్చుని ఏదో వారపత్రిక చదువుకొంటోంది.

తల స్నానం చేసినట్టుంది, తల వెంట్రుకల్ని చీకటి తెర దింపినట్టు వెనక్కు వేలాడేసి, చివర్లని పసుపు రిబ్బనుతో కట్టింది. వెంట్రుకలు పాయలు పాయలుగా పక్కలకు తప్పుకుని ధారల్లా తెల్లటి రవిక మీదకు దూకుతున్నాయి. రిబ్బనుముడి ఊడిపోయి కిందకు జారిపోతోంది. వెంట్రుకలు వీపు మీద అల్లుకుపోయి, వాటి మధ్యనుంచి తెల్లటి రవిక చారలు చారలుగా కనిపిస్తోంది. చీకటిని వెలుగు రేఖలతో చీలుస్తున్నట్టుందది. ఎడమచెవి పూసల గుత్తి, నల్లని పరదాను పక్కలకు తొలగించి చూస్తున్న ముస్లిమ్ పిల్లలా జడ లోంచి కుతూహలంగా తొంగిచూస్తోంది. వీపుమీద జాకెట్టు ఇంగ్లీషు 'వి' ఆకారంలో వెనక్కుదిగి, శరీరం బైటపడి, చీకటి మేఘంలా ఆవరించిన జుట్టుమధ్య ఆకాశంలా మెరుస్తోంది. చుట్టూ గాఢమైన నలుపులో శరీరం మరీ తెల్లగావుంది. వసుపు దంచిపరచిన కుప్పమీద వెన్నెలవాలి మెరసిన లేత వసుపురంగు శరీరం ఆమెది.

అనీలా లోపలినుండి వస్తూ పలకరించింది. అంతవరకూ మంజరి అతన్ని చూడనేలేదు. తుళ్ళిపడ్డట్టు సర్గిగా లేచి కూర్చుని "ఎంతసేపయ్యింది నువ్వువచ్చి" అంది.

"ఇప్పుడే" అన్నాడు వచ్చికూర్చుంటూ.

అనీలా కాఫీ పట్టుకొద్దామని వెళ్ళిపోయింది.

ఇద్దరూ చాలాసేపు మౌనంగా కూర్చుండిపోయారు. క్షణం తీరిక లేకుండా ఎప్పుడూ పెదాల్ని కదిపే మంజరి మూగదానిలా మౌనంగా వుండి పోవడం ఎబ్బెట్టుగావుంది. సూర్యాస్తమయంలో రంగుల్ని వెదజల్లకుండానే సూర్యుడు వెళ్ళిపోయినప్పుడూ, తుమ్మెదలు ఝుంకారం చేయకుండానే ఎగురుతున్నప్పుడూ ఎంత ఎబ్బెట్టుగా, అసంతృప్తిగా వుంటుందో మంజరి మౌనంగా వుండడంలోనూ అంతే ఎబ్బెట్టూ, అసంతృప్తీ వున్నాయి. బహుశా అకస్మాత్తుగా ఏ ఆశ్చర్యకరమైన విషయాన్నో తెలియజేసి అతన్ని ఉక్కిరి బిక్కిరి చేసి ఆనందంలో ముంచెత్తడానికై నిశ్శబ్దాన్ని సృష్టించిందేమో.

అనీలా కాఫీ పట్టుకొచ్చింది. ముగ్గురూ కూర్చుని కాఫీలు తాగుతున్నారు.

"నాకు నీ సలహా ఒకటి కావాలి శేఖరం. నా అంతట నేను ఏ విషయాన్నీ నిర్ణయించుకోలేను. నా వైవాహిక జీవితానికి సంబంధించిన ఒకానొక నిర్ణయంలో నీ సలహా అవసరం" అంది అకస్మాత్తుగా మంజరి.

అతనికి చాలా ఆనందంగా వుంది. ఇక్కడికి వస్తూ ఏఏ విషయాల్ని ఊహించుకున్నాడో ఆ విషయాలు జరగబోతున్నాయి. మధురంగా ఊహించుకున్న జీవితానికి మంజరి రూపకల్పన చేయబోతోంది. తాజ్‌మహల్ తనదే అయిపోయినప్పుడూ, వెన్నెలంతా తన పెరడులోనే వాలినప్పుడూ ఆనందాన్ని భరించలేకపోయినట్టే యిప్పుడూ అతని హృదయం యీ సంతోషాన్ని భరించలేకపోతోంది.

"ఏమిటావిషయం? చెప్పు" అన్నాడు.

ఆమె ఓ కవరులోంచి రెండు ఫోటోలు తీసి అతనికిస్తూ "పెళ్ళి చూపులకు పంపించిన ఫోటోలివి. ఈయన డాక్టరు. అతను ప్లీడరు. వీళ్ళిద్దర్లో ఎవరిని పెళ్ళి చేసుకోవాలో నిర్ణయించుకోలేక పోతున్నాను. ఈ విషయంలో నీ సలహా, అనీలా సలహా నాకు కావాలి" అంది.

"స్తబ్దుడైపోయాడు శేఖరం. మంజరి తనను ఏడిపించడానికి యిలా చేసిందనిపించింది. అతని అభిమానం దెబ్బతింది. ఈ సన్నిహితత్వం ఆమె గౌరవంచేత యిస్తున్నదికాదు, తన అదృష్టాన్ని తెలియజేసి ఏడిపించడానికి. ఇదంతా నటన. ఈ అభిమానమంతా కృత్రిమం. స్నేహం అనేది మనుషులు

మనుషులుగా మాట్లాడుకోవడానికి. స్నేహంలో నటించడాలు వుండకూడదు. లోకం గురించి మనిషి ఎప్పుడూ నటిస్తూనే వుంటాడు. కాని తన గురించి తాను నటించాల్సిన అవసరంలేదు. నటించి విసుగెత్తిపోయిన సమయాల్లో తను తానుగా బైటపడి స్వేచ్ఛగా వూపిరి పీల్చడానికి కనీసం ఒక వ్యక్తన్నా అవసరం. స్నేహం అందుకు అవసరమవుతుంది. నటించకుండా తను తానుగా బైటపడ్డచోటనే నిజమైన స్నేహం వుంటుంది. మంజరి నిజమైన స్నేహితురాలిలా మాట్లాడడంలేదు. కావాలని పెదాలమీద చిరునవ్వుల్ని అంటించుకొంటోంది. మాటల్ని అభిమానంలో తడిపి వదులుతోంది.

మంజరి మీద అతనికి కోపం వచ్చింది.

అతని ముఖంలోని మార్పుల్ని అనీలా గుర్తుపట్టింది. ఆ వాతావరణంలో నుంచి తాను తప్పుకోవడం ఉత్తమమనిపించి 'ఇప్పుడే వస్తాను' అని చెప్పి కాళీ అయిన కాఫీ గ్లాసుల్ని పట్టుకుని వెళ్ళిపోయింది.

"చెప్పండి. అలా బుద్ధుడిలా కూర్చుండిపోయారేం" అంది మంజరి కళ్ళ రెప్పల్ని ఎగరేసి.

"ఎందుకు మంజరీ యిలా నన్ను బాధపెడ్తావు? నీకు తెలుసు నిజంగా నేను యీ విషయంలో సంతోషంగా సలహా ఇవ్వలేనని. అయినా నువ్వు నన్ను నొప్పించాలని ప్రయత్నిస్తున్నావు. నేనంటే నీకెందుకంత కక్ష? ఏంచేశానని?"

నిజంగా అతని కళ్ళల్లో కన్నీళ్ళు తిరిగాయి. కంఠం బొంగురుపోయి, పెదుసులు వూడిపోయినట్టు అక్షరాలు ముక్కలు ముక్కలయిపోయాయి. అక్కడ నుంచి లేచి వరండాలోకి వచ్చేశాడు.

"ఏమిటీ! నేను బాధపెడుతున్నానా!!" అంది మంజరి చాలా అమాయకంగా ముఖంపెట్టి అతని వెనకనే వచ్చి.

అమాయకత్వాన్ని ప్రదర్శించడం ఆమెకు చేతకాలేదు. అంత అందమైన ముఖమూ అసహ్యంగా తయారయ్యింది. ఈజిప్టు 'ఉజైమండీస్' శిల్పంలా ప్రాభవాన్ని కోల్పోయి అసహ్యంగా కనిపించింది. అక్కడ యిక ఉండలేక ఆమె పిలుస్తున్నా వినకుండా వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మళ్ళీ మంజరిని కలవలేదు.

ఆ వూళ్ళో వుండడం అతనికి ఇష్టంలేకపోయింది. పరీక్షలయిపోయినా అక్కడే మరికొన్నిరోజులు వుందామనుకున్నాడుగాని మంజరి కలిగించిన మనస్తాపాన్ని తలచుకొంటూ బాధపడడం యిష్టంలేక స్వగ్రామం వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు మంజరిని కలవలేదు.

అనీలా అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తుండేది. మంజరిని గురించి ఎప్పుడూ అతను అడిగేవాడు కాదు. ఆమె రాసేదికాదు.

వెళ్ళిన మూడు నెలలకు మంజరి వద్దనుండి శుభలేఖ వచ్చింది. దానితో పాటు ఉత్తరమూ రాసింది.

"శేఖరం—

పెళ్ళి నిర్ణయమైంది. తప్పకుండా పెళ్ళికి వస్తావని ఎదురు చూస్తుంటాను. ఇంతకు ముందు తెలిసో తెలియకో నిన్ను నేనేమన్నా కష్టపెడితే నన్ను క్షమించు. ఇంకా నామీద కోపాన్ని పెంచుకోవడంలో అర్థంలేదు. ఏమిటో! నా స్వేచ్ఛ నన్నే బంధించేసింది.

ఉంటాను మరి

మంజరి"

ఉత్తరం చూసిన తర్వాత మంజరిని వూహించుకోవడం అతనికి సాధ్యం కాలేదు. చాలా నిరాశగా ఆ ఉత్తరాన్ని రాసినట్టనిపించింది. ఉత్తరంలోని ఆ చివరి వాక్యమే లేకపోతే మంజరిని పూర్వపు మంజరే అనుకునేవాడు. కాని ఆ ఒక్క వాక్యం మంజరిలో ఎంతో మార్పుని చూపిస్తోంది. తప్పుచేసినా పశ్చాత్తాపపడే వాళ్ళంటే అతనికి గౌరవం. సాధారణంగా ప్రతిమనిషీ తప్పు చేస్తాడు. దేవుడనుకునేవాడే తప్పులు చేశాడు. అతని ఎక్కువ తప్పులు చేయని వారు ఎవరన్నా వున్నారంటే అతను ఆ దేవుడు సృష్టించిన మనిషే.

మంజరి మీద అతనికి కోపంలేదు. తనను పెళ్ళి చేసుకోలేదని ఆమెను నిందించడం మంచిపనిగా అనిపించలేదు. స్వార్థపరురాలనడంలో అర్థంలేదు. ప్రతి మనిషీ స్వార్థపరుడే. ఆ స్వార్థం యితరులకు నష్టం కలిగిస్తే అది

ప్రమాదకరం. అంతవరకూ స్వార్థం ప్రతి మనిషికీ అవసరమే. అప్పుడది స్వార్థంకాదు. ఆశయం.

ఆమెను అతను కోరుకున్నాడు. అందగత్తె అనీ, ఆ సౌందర్యం తన ఒక్కడి ఆస్థీ అయిపోవాలనీ కోరుకున్నాడు. ఆమె కూడా అలానే—చక్కటి ఉద్యోగమూ, మంచి 'పెర్సనాలిటీ' ఉన్న భర్తను కోరుకుని వుండవచ్చు.... ఆరోజు రెండు ఫోటోలూ యిచ్చి సలహా యివ్వమనడంలో ఉద్దేశం ఇద్దరిలో అందమైనవాళ్ళు ఎవరో చెప్పమని అడగడమే. అంతమాత్రంచేత ఆమె తనను మోసగించిదనుకోవడం మంచిది కాదనిపించింది.

శుభలేఖ తీశాడు. వరుడు సివిల్ ఇంజనీరు. ఆరోజు చూపించిన యిద్దర్లోనూ ఎవరూ కారన్నమాట! బహుశా ఆ సంబంధాలు రెండింటికన్నా యిదే ఆమెకు నచ్చివుండవచ్చు. కాని ఆమె ఉత్తరంలోని ఆఖరి వాక్యానికి అర్థం ఏమైనట్లు?

ఎందుకో మంజరి ఒక ఇంజనీరును పెళ్ళాడ్డం అతనికి యిష్టంలేదు. ఏ ఇటాలియన్ శిల్పో, కోణార్క శిల్పో, తంజావూరు శిల్పో చెక్కిన శిల్పం ఏ కలలోనో ప్రాణం పోసుకుని ఎదుటికొచ్చి నుంచున్నట్టుండే మంజరి, ఒక ఇంజనీరుకు భార్య కావడం చాలా బాధాకరమైన విషయంగా అనిపించింది. ఆమె భర్త పది అంతస్తుల మేడల్ని కట్టించగలడు. పబ్లిక్‌గార్డెన్లకు ప్లానుల్ని గీయగలడు. దేవుడికి అధునాతనంగా దేవాలయాన్ని కట్టించి యివ్వగలడు. కాని ఆ దేవాలయంలోని దేవుడ్ని చెక్కలేడు. అతను మనిషికి కావలసిన అవసరాల్ని తీర్చగలడుగాని మనిషికి ప్రతిసృష్టి చేయలేడు.

మంజరి లాంటిది ఏ ఆర్టిస్టుకు మోడలుగానో, ఏ రసికుడికి భార్యగానో ఉండాల్సిన ఆడది. ప్రపంచంముందు నిలుచోబెట్టాల్సిన స్త్రీ ఆమె. ఆమె అందాన్ని చట్రంలో బిగించి గోడలమీద వేలాడగట్టో, శిల్పాల్లో మలచి భవంతులముందు నిలుచోబెట్టో నలుగురికీ చూపించాలి. ఆమెను పబ్లిక్‌గార్డెన్లలో పూలమొక్కలమధ్య స్వేచ్ఛగా తిరగనివ్వాలి. మహానగరం మధ్య ఫుట్‌పాత్ మీద నడవనివ్వాలి. నగరం శివార్లలో నిర్మానుష్యమైన పొలాల్లో విశాలమైన ఆకాశం కింద పరుగెత్తనివ్వాలి. మూడోతరగతి రైలు పెట్టెలో దేశమంతా తిప్పి

తీసుకురావాలి. ఆమె కోరితే డాబామీద వెన్నెల్లో ఒక్కర్తినీ వదిలేసి ఒంటరిగా నిద్రపోనివ్వాలి. అలాంటి స్త్రీ ఆమె. ఏ వ్యక్తి గురించీ ఆమె భవనంలో నాలుగు గోడలమధ్యా బంధింపబడకూడదు. అలసిపోతుందని పాదాలు నేల మీద ఆన్చనివ్వకుండా కారుల్లో తిప్పగూడదు ఆమె భర్త యిందుకు సిద్ధపడగలడా?

అతనికి మంజరి మీద చెప్పలేని దిగులైంది. బహుశా ఆమె ఉత్తరం లోని ఆఖరి వాక్యానికి అర్థం యిదేనేమో.

మంజరి పెళ్ళికి వెళ్దాం అనుకున్నాడుగాని వీలుపడలేదు. అకస్మాత్తుగా వాళ్ళమ్మకు జబ్బుచేసి ఉండిపోవలసి వచ్చింది. అంతకుముందు వేసిన ఆమె చిత్రాన్ని పెళ్ళి కానుకగా పంపిస్తూ, రాలేకపోతున్నందుకు ఏమీ అనుకోవద్దని ఉత్తరం రాశాడు.

పెళ్ళి హడావిడి అంతా అయిపోయిన తర్వాత ఒక నెలరోజులకు అత్తగారింటినుంచి అతనికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉత్తరం రాసింది. ఆమె భర్త సీలేరు ప్రాజెక్టువద్ద ఇంజనీరు. ఉత్తరంలోని అడ్రసునుబట్టి ఆ విషయం తెలిసింది. ఆ వుత్తరంలో ప్రత్యేకించి భర్తను గురించి ఏమీ రాయలేదు.

మంజరిని గురించిన విషయాలు ఆ తర్వాత అతనికేమీ తెలియలేదు. అనీలా అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తుండేదిగాని, మంజరిని గురించి రాస్తే అతను పాత జ్ఞాపకాలతో బాధపడతాడేమోనని ఆమెను గురించి ఏమీ రాసేది కాదు. అతనుకూడా తనంతతానుగా అడిగేవాడు కాడు.

శేఖరానికికూడా ఆయేడే పెళ్ళయింది. అతని తల్లి ఆరోగ్యం అంతంత మాత్రంగానే వుండడంవల్ల, ఆమె కంగారుపెడితే చేసుకోక తప్పలేదు. మావ గారు విశాఖపట్టణంలో రైల్వేలో కేషియరుగా పనిచేసి రిటైరయ్యారు. అమ్మాయి యింటర్‌వరకూ చదువుకుంది. పెళ్ళిచూపులకు వెళ్ళి అమ్మాయిని చూసిన తర్వాత వెంటనే వప్పేసుకున్నాడు.

గ్రీకు శిల్పాల్లోలాగా భారీమనిషి ఆమె. దూరంనించి చూస్తే అతని కన్నా పొడుగ్గా వుంటుంది. అతనిపక్క నిలచోబెడితే చెవుల దగ్గర కొస్తుంది. పుష్టిగా పెరిగిన శరీరం ఆమెది. ముక్కు చిన్నదే అయినా ఆ శరీరానికది

అందాన్నే యిచ్చింది. కళ్ళు బాగా పెద్దవి. చిన్న నోరు. ఉబ్బిన చెక్కిళ్ళు. కంగారా స్కూల్ పెయింటింగుల్లోని స్త్రీలలా వుంది.

"అన్నయ్య అదృష్టవంతుడు పిన్నీ" అంది అనీలా పెళ్ళికూతుర్ని గురించి శేఖరం తల్లితో మాట్లాడుతూ.

శేఖరం ఆలకించి 'నిజం, అదృష్టవంతుడ్నే' అనుకున్నాడు.

పెళ్ళికి మంజరి అభినందనల్ని పంపించింది.

పెళ్ళి హడావిడి తగ్గాక మంజరికి కృతజ్ఞతలు తెలుపుకొంటూ ఉత్తరం రాద్దామనుకొంటూనే మర్చిపోయాడు.

కోరుకున్నదానికన్న అతని జీవితానికి ఎక్కువే లభించింది. అందమైన భార్య, చేసిన కృషికి ప్రజల గుర్తింపు, ఆర్థిక పుష్టి—యింతకన్న మనిషికి కావలసినవి ఏమున్నాయి? భవిష్యత్తు సుందరంగా కనిపిస్తున్నప్పుడు గతాన్ని తలంచుకోవలసిన అవసరం కనిపించలేదు. జీవితంలో ప్రతిరోజు రాత్రి రేపటి సూర్యుడ్ని తలంచుకొంటూ నిద్రపోవడం!

ఒకరోజు పనివుండి పట్నం వెళ్ళినప్పుడు అనీలాను కలుస్తే ఆమె చెప్పింది. మంజరి పుట్టింటికి వచ్చిందట. ఆరోగ్యం బాగుండకపోతే మందు పుచ్చుకుందామని యిక్కడకు వచ్చిందట. 'నువ్వు వస్తానంటే యిద్దరం కలిసి వెళ్దాం' అంది ఆమె. అలానే అన్నాడు అతను.

ఆరోజు సాయంకాలం యిద్దరూ వెళ్ళారు. మంజరి రేడియో పెట్టుకొని వింటోంది.

వాళ్ళను చూడగానే కళ్ళు ఎగరేసి "రండి రండి. కలలో కొచ్చినట్టు అకస్మాత్తుగా వచ్చావు. ఇంతకూ ఊరునుంచి ఎప్పుడొచ్చావు?" అంది.

పెళ్ళయిన తర్వాత మంజరిలో పెద్దగా వచ్చిన మార్పేమీలేదు. కళ్ళకు కాటుక పెట్టడం మానేసినట్టుంది. కంటిగుడ్లు పాలిపోయినట్టు కనిపిస్తున్నాయి. ఆరోగ్యం బాగోలేదని అనీలా చెప్పడంవల్లనో యేమో కొద్దిగా సన్నబడ్డట్టనిపిస్తోంది. చెక్కిళ్ళమీద రంగు పల్చబడింది.

"ఇవ్వాళే వచ్చాను. వంట్లో బాగుండలేదట, ఎలావుంది?" అన్నాడు.

"ఏమీలేదు. ఆ మధ్య నాలుగురోజులు జ్వరపడ్డాను. వంట్లో కొద్దిగా నీరసంగా వుంటే కోలుకునేవరకూ యిక్కడే వుండమని వారు తీసుకొచ్చి దిగబెట్టి వెళ్ళారు" అంది.

కొత్త జీవితంలో నుంచుని ఎలా ఆమెతో మాట్లాడాలో అతనికి తోచలేదు.

"నేనసలు వెళ్ళనే అన్నాను. వారే కోప్పడి, దగ్గరుండి తీసుకొచ్చారు" అంది తిరిగి.

లోపలకు వెళ్ళి కాఫీలు పట్టుకొచ్చింది. చాలా సేపు అనీలా, మంజరీ కబుర్లు చెప్పుకుంటూ కూర్చుండిపోయారు.

శేఖరం వాళ్ళ ప్రసంగాన్ని విననట్టు వుండిపోయాడు.

"పెళ్ళి బాగా జరిగిందా, రాలేకపోయాను నేను" అంది మంజరి అతన్ని వట్టినే కూర్చోనివ్వడం యిష్టంలేక.

"బాగానే జరిగింది" అన్నాడు.

"నువ్వెందుకు వస్తావులే, ఇంజనీరు భార్యవు" అంది అనీలా.

"వారి తప్పేమీలేదు. వెళ్ళమనే అన్నారు. విశాఖపట్టణమేకదా, వద్దామనుకున్నాను. కాని సరిగ్గా సమయానికి బంధువులొచ్చారు" అంది మంజరి.

అతనికి చాలా ఆశ్చర్యంగావుంది. అస్తమానం మంజరి వాళ్ళాయన మంచితనం గురించే మాట్లాడడం వింతగావుంది. అక్కడ కూర్చున్న గంట లోనూ ఆమె వాళ్ళాయన్ను యిరవైసార్లన్నా జ్ఞాపకం చేసుకుని వుండాలి. అస్తమానం ఆమె అలా వాళ్ళాయన గురించే మాట్లాడ్డం అతనికి విసుగ్గావుంది. కేవలం తనను ఏడిపించడానికే ఆమె అలా మాట్లాడుతున్నదేమో ననిపించింది. ఎక్కువగా అతనేమీ మాట్లాడలేకపోయాడు.

అక్కడనుంచి వచ్చేస్తున్నప్పుడు మీ ఆవిడ్ని ఒకసారి చూడాలని వుంది. తీసుకుని రాగూడదూ" అంది.

"ప్రయత్నిస్తాను" అని చెప్పి బయలుదేరాడు.

ఒక విషయం అతనికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. తన వైవాహిక జీవితాన్ని గురించి రాసిన ఉత్తరానికీ, మంజరి ధోరణికీ ఎక్కడా పొత్తు కుదరడంలేదు. భర్తంటే యింత అభిమానం చూపించే ఆమె ఎందుకలా ఉత్తరం రాసింది?

దానికి చాలా సమాధానాలు లభించాయి. తనను ఓదార్చడానికైనా ఆమె అలా రాసివుండవచ్చు. భర్తను పూర్తిగా అర్థంచేసుకోని తొలిరోజుల్లో అలా రాసినా రాయవచ్చు. కేవలం యథాలాపంగానే కావచ్చు.

ఇంటికి వెళ్ళిపోయిన తర్వాత ఒకసారి భార్యను వెంటబెట్టుకుని వెళ్ళి మంజరిని కలుద్దాం అనుకున్నాడుగాని వీలుపడలేదు ఆ విషయం తెలియజేస్తే "పోనీ మీ ఆవిడ ఫోటోనన్నా పంపించు. చూస్తాను" అని రాసింది మంజరి.

అలానే అతను పెళ్ళినాటి ఫోటో—ఇద్దరూ కలిపి తీయించుకున్నది— పంపించాడు. దానితోపాటు ఉత్తరం రాస్తూ వాళ్ళ ఫోటో కూడా ఒకటి పంపించమన్నాడు.

ఎందువల్లనో ఆ ఉత్తరానికి సమాధానంగాని, పంపమన్న ఫోటోగాని రాలేదు.

ఆర్నెల్లు తర్వాత ఒకసారి అకస్మాత్తుగా రైల్లో కలిసింది ఆమె. బావ మర్దికొడుకు బారసాలకని భార్యతో వెళ్ళి, అది కాగానే భార్యను అక్కడే వదిలేసి ఒక్కడూ వస్తున్నాడు శేఖరం. వాల్తేరు స్టేషన్లో ఆమె కలిసింది. ఆమె ఒక పెట్టెలో వుంది. అతను చూడలేదు. కాళీగావున్న పెట్టెను వెతుక్కొంటూ వెళ్తోంటే ఆవిడే చూసి పలకరించింది. ఆమెది రిజర్వేషన్. మరోచోట స్థలం వెతుక్కొని అనకాపల్లి స్టేషనులో కలుస్తానని వచ్చేశాడు.

"ఎక్కడలేని డబ్బూ యీ ప్రయాణాలకే ఖర్చవుతోంది" అంది ఆమె అనకాపల్లి స్టేషనులో అతను కలిసినప్పుడు. వాళ్ళాయనకు అరకు ట్రాన్స్ఫర్ అయిందట. అంతవరకూ ఆమె పుట్టింట్లోనే వుంటుందట.

మనిషి మరికాస్త సన్నబడింది. కంటికింద గుంటలు కొద్దిగా నల్లబడ్డాయి. ఆ కళ్ళు నీళ్ళతో తడిసి తడిసి, అంచుల్ని కరిగించుకుని మడుగులు విశాలమైనట్టు అనిపిస్తున్నాయి. మాట్లాడేటప్పుడు కంటిపాపలు కదిలి అల్లరి

చేయడంలేదు. అలసిపోయినట్టు మందంగా కదులుతున్నాయి. కాటుకలేని కళ్ళు చూపుల్ని లాక్కోవడంలేదు. హృదయంలో రగుల్కొన్న జ్వాలల్లోపడి యినుపగోళాలు ఎర్రబడ్డట్టు కంటిపాపలు తేనెరంగులో మెరుస్తున్నాయి.

"బాగా చిక్కిపోయావు" అన్నాడు.

ఆమె దిగులుగా నవ్వి "అభిమానంతో చూస్తే అలానే వుంటుంది. వారుకూడా అస్తమానం అలానే అంటుంటారు" అంది.

ఆ తర్వాత ఏం మాట్లాడాలో అతనికి తోచలేదు. ఏం మాట్లాడినా ఆమె వాళ్ళాయన గురించి చెప్తుందేమోనని భయం.

బండి కదిలితే అతను గబగబా వెళ్ళిపోయాడు. తుని స్టేషన్లో మళ్ళీ కలుసుకున్నప్పుడు కేంటీను నుండి టిఫిను, కాఫీ పట్టుకొచ్చి యిచ్చాడు.

"ఈ మధ్య కాఫీ తాగడం మానేశాను. వంట్లో బాగోడంలేదని కాఫీ మానిపించి వారే ఓవల్టీను అలవాటు చేశారు. సరేలే తాగకపోతే ఏమన్నా అనుకుంటావు. ఇలా యివ్వు" అంది.

టిఫిను తిని, కాఫీ తాగేసి "ఎక్కడకు వెళ్ళినా నాకీ అభిమానానికి కొరత లేకుండా వుంటోంది శేఖరం. ఇంతకన్నా నాకు కావలసింది ఏముంది" అంది.

ఆ వాక్యం ఎవరిని అభినందిస్తూ అన్నదో అతనికి అర్థం కాలేదు. వాళ్ళాయన్ను జ్ఞాపకంచేసుకొని అన్నదో, తనుచూపిస్తోన్న అభిమానానికి కృతజ్ఞురాలిగా అన్నదో తెలియక మౌనంగా వుండిపోయాడు.

కాని ఒక విషయం అతనికి అర్థంగాకుండా వుంది. ఇంత అభిమానం చూపిస్తోన్న భర్తమీద మంజరికి గౌరవం, ప్రేమ వుండడంలో ఆశ్చర్యం లేదు. కాని అస్తమానం తన ఎదుట ఆయన్ను తలంచుకొని తనను ఏడిపించాలనే ప్రయత్నం చేయడంలో మంజరి ఉద్దేశ్యం ఏమిటి? నిర్దయగా తన భవిష్యత్తును తొక్కుకుంటూ ముందుకు వెళ్ళిపోయికూడా అంతటితో కసితీరక వెనక్కు తిరిగి ఆ వెక్కిరింపేమిటి? తనంటే ఆమె కెందుకంత కోపం?

ఇంతగా ఆమె పదేపదే తలంచుకొంటోన్న ఆమె భర్తను ఒకసారి చూడాలనిపించింది.

"నేను పంపించిన ఫోటో అందిందా?" అన్నాడు శేఖరం.

అందింది అన్నట్టుగా తల ఆడించింది.

"మరి! మీ ఫోటో పంపించమన్నానుకదా పంపలేదేం?" అన్నాడు.

"పంపకపోవడమేమిటి! అప్పుడే పంపానుకదా. అందలేదా?" అంది ఆశ్చర్యంగా కళ్ళను విప్పుకుని.

ఎందుకో ఆమె నిజం చెబుతున్నట్టనిపించలేదు. ఆ ముఖంలో అమాయకత లేదు. కావాలని కనుబొమలను పైకెత్తింది. అలా పైకెత్తినపుడు నొసటలో ఆశ్చర్యాన్ని సూచించే ముడతలు ఏర్పడినా పెదాల్లో చలనం లేకపోవడంవలన అది కృత్రిమమే అనిపించింది. ఆశ్చర్యంలో కళ్ళేకాదు పెదాలు కూడా విచ్చుకుంటాయి. కాని మంజరి పెదాల్ని బిగించి, కనుబొమల్ని మాత్రమే పైకి ఎగరేసింది. మంత్రించినట్టు కంటిపాపల్ని బంధించేసింది. ఎప్పుడూ కదిలే ఆ కంటిపాపలు అలా స్థిరంగా వుండిపోవడం ఎబ్బెట్టుగా అనిపిస్తోంది.

"ఇద్దరం కలిసి తీయించుకున్న ఫోటో కాపీలు లేకపోతే, ఎవరో మంత్రిగారు వచ్చినప్పుడు ప్రాజెక్టువద్ద విడిగా మంత్రిగారితో వారు కలిసి తీయించుకున్న ఫోటో పంపించాను. బహుశా పోస్టులో ఎవరన్నా కొట్టేశారేమో" అంది తిరిగి మంజరి.

కాని అతనికి నమ్మకం కుదరలేదు. పోస్టులో ఎప్పుడూ అతని వుత్తరాలు పోలేదు. ఆమె అబద్ధం ఆడుతున్నట్టే అనిపించింది.

"పోస్టువాళ్ళు కొట్టేయడానికి మీ ఆయన అంత మన్మథుడా?" అన్నాడు నవ్వుతూ.

ఆమె నొచ్చుకున్నట్టు ముఖం మాడ్చుకుని కూర్చుంది. ఆ తర్వాత అతనితో మళ్ళీ స్వేచ్ఛగా మాట్లాడలేకపోయింది.

రాజమండ్రి స్టేషన్లో యిద్దరూ దిగిపోయారు. అతను అక్కడ నుండి బస్సులో మరికొంతదూరం ప్రయాణం చేయాలి. ఆ దగ్గర్లోని ఓ పల్లెటూరు అతనిది.

వెళ్ళేటప్పుడు యథాలాపంగా "వస్తాను శేఖరం, ఎప్పుడన్నా ఒకసారిరా" అనిమాత్రం అంది. అలానే అని చెప్పి వెళ్ళిపోయాడు.

నెలరోజుల తర్వాత భార్య వస్తోంటే స్టేషనుకువెళ్ళి రిసీవు చేసుకుందామని పట్నం వచ్చినప్పుడు అనీలా చెప్పింది—మంజరి భర్త వచ్చాడట, ఊళ్ళోనే వున్నాడు—అని.

బండి మధ్యాహ్నం రెండింటికి వస్తుంది. దగ్గర దగ్గర మూడు గంటలటయిముంది. ఒకసారి వెళ్ళి కలిసివద్దామని అనీలాను వెంటబెట్టుకుని వెళ్ళాడు.

తీరా వెళ్ళేసరికి అతను లేనేలేడు.

"తెలిసిన ఒకాయన్ని కలుసుకొస్తానని కాకినాడ వెళ్ళారు. మళ్ళీ రాత్రికి వచ్చేస్తారు" అంది మంజరి. అర్ధగంటకన్నా ఎక్కువ అక్కడ వుండలేకపోయాడు. అనీలా ఇంకాస్సేపు ఉంటానంటే ఆమెను వదిలేసి ఒక్కడూ బయలుదేరాడు. వచ్చేముందు "పదిరోజులపాటు యిక్కడే వుంటారులే కలుద్దువుగాని, ఉత్తరం రాస్తాను నువ్వూ మీ ఆవిడా రండి" అంది మంజరి.

వస్తున్నప్పుడు సందుమలుపు తిరుగుతూండగా మంజరి ఇంట్లో పనిచేసే కుర్రాడు ఎదురయి పలకరించి నమస్కారం చేశాడు వాడి నమస్కారానికి అర్థం చిల్లరడబ్బులనీ అతనికి తెలుసు. మొదట్లో శేఖరమే అది అలవాటు చేశాడు.

పావలాబిళ్ళ వాడిచేతుల్లో పెడుతూ "స్టేషనునించేమిట్రా వస్తున్నావ్" అన్నాడు.

"లేదండి. ఊరినించి అల్లుడుగారు వచ్చారుకదండి. ఆరు కాలేజీ సూపించమంటే సూపించి వత్తన్నానండి. ఆరు ఆడవుండిపోయారు" అన్నాడు వాడు.

శేఖరానికి చాలా ఆశ్చర్యంగావుంది. మంజరి ఎందువల్ల అబద్ధం చెప్పిందో అతనికి అర్థంకాలేదు. పరిచయం చేయడంవల్ల భర్త అనుమానిస్తాడనే కావచ్చు. ఇదే నిజమైతే మంజరి చెప్తున్నట్టు ఆమె భర్త అంత సహృదయుడు కాడనే అనుకోవాలి.

అక్కడనుండి కదిలి స్టేషనుకు వెళ్ళి భార్యను రిసీవుచేసుకుని, ఆ వెంటనే వాళ్ళవూరు వెళ్ళిపోయాడు.

మంజరి ఎందువల్ల అలా అబద్ధం చెప్పిందో కారణం తెలుపవలసిందని అనీలాకు వుత్తరం రాద్దామనుకుంటుండగానే మంజరి వద్దనుండి వుత్తరం వచ్చింది. అతన్నీ, అతని భార్యనూ కలిసిరమ్మనమనీ; వాళ్ళాయనకూడా వున్నారుగనుక అంతాకలిసి ఎక్కడికైనా పిక్‌నిక్‌కు వెళ్ళామనీ, వచ్చే ఆదివారం తప్పకుండా రమ్మనీ మరిమరీ రాసింది.

వెళ్ళి, మంజరిని యిబ్బందిలో పెట్టగూడదనుకున్నాడుగాని ఎందుకో ఒకసారి వెళ్ళి ఆమె భర్తను కలుసుకుని మాట్లాడాలనిపించింది.

ఆదివారం ఉదయం భార్యతోసహా ఆ వూరు చేరుకున్నాడు. అనీలా బయటికి రావడానికి వీల్లేదు. అందువల్ల వాళ్ళిద్దరే మంజరి యింటికి వెళ్ళారు.

మంజరి మేడమీదనుంచే వాళ్ళను చూసి చేతులూపింది. తెల్లటి చీరమీద కొద్దిగా ఎండపడి చూపులు చెదిరిపోతున్నాయి. ఆమె తలమీద మేఘాలులేని నీలమైన ఆకాశం. మేడలో నీలంరంగు పూసిన గోడలు. దిగువన కాంపౌండులో పచ్చని గడ్డిమైదానం. కిందనుంచి చూస్తోంటే ఆమె సముద్రం వద్దున 'స్టేట్యూ ఆఫ్ లిబర్టీ'లా అనిపిస్తోంది.

గబగబా మేడమెట్లుదిగి ఎదురువచ్చి లోపలకు తీసుకెళ్ళింది. మంజరి చూపులన్నీ అతని భార్య మీదనే వున్నాయి.

పరిచయాలు, ఆతిథ్యాలతో పావుగంట గడిచిపోయింది.

'మీ ఆయన లోపలవున్నారా' అన్నట్టుగా కళ్ళతోనే అడిగాడు శేఖరం.

"అర్జంటుగా రమ్మని నిన్నరాత్రి టెలిగ్రాం వచ్చింది శేఖరం. రాత్రికి రాత్రే వెళ్ళిపోయారు" అంది.

శేఖరానికి యిదేదో యింద్రజాలంగా అనిపించింది. ఎన్నిసార్లు వచ్చినా ఆయన కలవడంలేదు. మంజరే తనంత తానుగా ఆయన్ను కనబడనీయకుండా దాగుడుమూత లాడిస్తోంది. ఇవ్వాళ ఆమె చెప్పినదాంట్లో కూడా నిజం వుంటుందని అనుకోలేకపోతున్నాడు. ఆయన ఆదివారం వుండడని తెలిసే

తనను ఆ రోజుకు రమ్మనమని వుత్తరం రాసివుండాలి. ఆమె భర్తకు తనను పరిచయం చేయడం ఆమెకు యిష్టం లేకపోవచ్చు. అతను వట్టి అనుమానం మనిషేమో. ఇటువంటి భర్తతో కాపురం చేయడంలో, పైకి కనిపిస్తున్నట్టు, నిజంగా మంజరి సుఖపడడంలేదు. ప్రపంచ ప్రసిద్ధమయిన ఏ కళాఖండమో కావలసిన మంజరి చివరికి యిలా కావడం అతనికి చాలా బాధగావుంది.

ఆడవాళ్ళు మాట్లాడుతూ కూర్చున్నారు. మంజరి వాళ్ళాయన గురించీ, ఉద్యోగం గురించీ, అక్కడి ప్రదేశాల గురించీ చెప్తోంది. శేఖరానికి అక్కడ వుండాలనిపించలేదు. వరండాలోకొచ్చి ఏదో మేగజైను చదువుకొంటూ వుండిపోయాడు. ఆడవాళ్ళ మాటలు తెమిలేసరికి మధ్యాహ్నమయ్యింది.

భోజనాలుకూడా అక్కడే చేశారు.

భోజనం చేస్తున్నప్పుడు శేఖరం అడిగాడు 'పోనీ, మీ ఆయన ఫోటో అన్నా యిక్కడలేదా చూడ్డానికి' అని.

"లేదు శేఖరం! ఆయనకి ఫోటోలు తీయించుకోవడం అంటే ఇష్టంలేదు. దానికి ఏదో కథచెప్తారు" అంది. ఆ కథను తలంచుకొని భయపడిపోయినట్టు ఆమె ముఖం పాలిపోయింది.

అంతకు ముందు రైల్లో కనిపించినప్పుడు ఫోటో పంపించానని చెప్పినది నమ్మాలో, ఇది నమ్మాలో శేఖరానికి తెలీలేదు. ఒకవేళ రెండూ నమ్మదగ్గవి కాకపోయినా కాకపోవచ్చుననిపించింది.

సాయంకాలం వరకూ అక్కడే వున్నాడు. మరో రోజు వుండమని మంజరీ, వాళ్ళమ్మా బలవంతం చేశారుగాని వుండలేదు. వచ్చేసేముందు మంజరితో ఒంటరిగా మాట్లాడే అవకాశం చిక్కింది. అదీ మూడునిమిషాలే. వాళ్ళావిడ మంజరి తల్లితో చెప్పివద్దామని మేడమీదకు వెళ్ళినప్పుడు మంజరి ఒక్కర్తే వరండాలో అతని ఎదుట నిలిచివుంది.

చాలా సేపటినుండి ఒక విషయం ఆమెను అడగాలనుకొంటున్నాడు. ఇలాంటి అవకాశం గురించే ఎదురుచూస్తున్నాడు.

"అబద్ధాలు ఆడడం ఎప్పుడు నేర్చుకున్నావు మంజరీ! అందమైనవాళ్ళు అబద్ధాలు ఆడినా అందంగానే వుంటుందట. నువ్వు ఎంత పచ్చి అబద్ధం

ఆడుతున్నా ఎబ్బెట్టుగా అనిపించడంలేదు. కాని యింత శ్రమపడి, కృత్రిమంగా నటించి నువ్వు సాధించిందేమిటి? మీ ఆయన్ను ఊళ్ళో పెట్టుకొని కూడా లేడని చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది?"

ఆమె ఏమీ మాట్లాడలేదు. దెబ్బతిన్న దానిలా కొద్దిక్షణాలు అతని ముఖంలోకి చూసి తల దించుకొంది. రెప్పలు కన్నీళ్ళతో తడిసి కిందకు వాలిపోయాయి. కంఠం దిగువన స్వరపేటికవద్ద దుఃఖం గూడుకట్టుకొని ఉబ్బిపోయింది. పెదాలు బిగుసుకుపోయి అర్ధచంద్రాకారంగా కిందకు దిగిపోయాయి.

"చెప్పు మంజరీ. అన్నాడు శేఖరం తిరిగి.

పాలిపోయిన ముఖం నిప్పుల్లో కాలినట్టు ఎర్రబడిపోయింది. విసురుగా తలఎత్తి సూటిగా అతని ముఖంలోకి చూసింది. కనుబొమల్లో కోపం వంపులు తిరిగింది. కళ్ళల్లో నీళ్ళుచేరి, ఆ నీళ్ళల్లో ముఖంలోని ఎరుపు పడి ప్రతిఫలిస్తోంది.

"మా ఆయన గురించి నిజంగా నీకేమీ తెలీదా శేఖరం ఎందుకలా ఏమీ తెలీనట్టు నటిస్తావు. అసలా నీకేమీ చెప్పలేదని ఎలా అనుకోనూ? నీకంతా తెలిసికూడా కావాలని ఏడిపిస్తున్నావు నన్ను. మాటిమాటికీ ఆయన గురించి అడగడంలో అర్థం నన్ను బాధపెట్టాలనేగా. ఇలా నన్ను చిత్రహింస చేయడంలో నీకు లాభించేదేమిటి? నామీద కక్ష తీర్చుకోవాలనుకొంటున్నావా శేఖరం. నిన్ను తిరస్కరించినందుకు యీవిధంగా ప్రతీకారం తీర్చుకుంటేనే గాని నీకు మనశ్శాంతి లేదా? నేను నీకుచేసిన అపకారం ఏమిటి? నిన్ను పెళ్ళి చేసుకోక పోవడమేగా. అంత మాత్రంచేత ప్రతిసారీ నా దురదృష్టాన్ని ఎత్తిచూపించి ఎందుకు ఏడిపిస్తావు? నిజంచెప్పు—ఆయన అందవికారుడని నీకు తెలీదూ? చెవుడని నువ్వు వినలేదూ?"

మంజరి కంఠం బొంగురుపోయింది. కంఠం చుట్టూ ఉరితాడు బిగుసుకు పోయినట్టుగా మాటలు బైటకు రాలేక ఆమెలోనే అణిగిపోయాయి. కసితో తననుతానే హత్యచేసుకుని, బాధను భరించలేనట్టు వగరుస్తోంది.

అక్కడ యిక వుండలేక అతను పిలుస్తున్నా వినకుండా చరాచరా మేడ మీదకు వెళ్ళిపోయింది.

అతను క్షణంపాటు స్తబ్ధుడైపోయాడు. సత్యానికి కత్తిపోటు అది. ఆ బాధ ఆమెకేకాదు, అతనికీనీ. దెబ్బతిన్నవాడిలా శేఖరం ఓసారి హృదయాన్ని తడుముకుని అక్కడనుండి బయలుదేరాడు.

ఒక్క విషయం అతనికి అర్థంగాకుండా వుంది. 'తన వివాహ విషయంలో సంపూర్ణ స్వేచ్ఛగల మంజరి అంత అందవికారుడైన వాడిని ఎందుకు పెళ్ళి చేసుకుంది?' చాలాకాలం వరకూ ఆ ప్రశ్నకు సమాధానమే దొరకలేదు.

*     *     *     *

అయిదు నెలల తర్వాత ఆ ప్రశ్నకు సమాధానం లభించింది. ఒక రోజు రాత్రి వేగంగా నిద్రరాక, అలమారాలోంచి ఎప్పటిదో 'మబ్బుతెరలు' అనే కథల సంపుటిని తీసి చదువుతూ కూర్చున్నప్పుడు, అందులోని జీవిత సత్యం అనే కథ మంజరిని జ్ఞప్తికి తెచ్చి అతని ప్రశ్నకు సమాధానాన్ని యిచ్చింది.

భర్త మంచివాడుకాదని కాపరానికి వెళ్ళడం మానేసిన ఆ కథలోని అమ్మాయి, అకస్మాత్తుగా మనసు మార్చుకుని భర్త దగ్గరకు వెళ్ళడానికి ఏ యౌవ్వనపు పొరపాటైతే కారణమైందో, అదే పొరపాటు, మంజరి అంద వికారుడైన ఆ ఇంజనీరును పెళ్ళి చేసుకోవడానికి కూడా కారణమై ఉంటుందని అనిపించింది.

చేదులాంటి యీ నిజాన్ని తెలియజేసిన ఆ పుస్తకం మీద విపరీతమైన కోపం వచ్చి, విసురుగా దాన్ని నేలమీదకు గిరాటేశాడు శేఖరం.

(1962)

★